# తుకారాం

కుండలు, చట్లు చేసి అమ్మ కుమ్మరి ఈ తుకారాం. తాను సంపాదించిన ధనమును దుఃఖితులకు పంచిపెట్టెడి ఉదార స్వభావుడు. భక్తి హృదయమును పొందుటచే అతని దయాప్రేమలు నానాటికి వృద్ధిచెంది ఉన్న ఆస్తినంతయూ దీనులకు పెట్టుటలో పూర్తి చేసుకొని కడకు బిచ్చమెత్తుటకు సిద్ధమైన నిరాడంబరి ఈ తుకారాం. భక్తిభావోద్రేకముతో ఆయన వ్రాసిన కీర్తనలు, శ్లోకములు, పద్యములు అత్యంత భావగర్భితములై యుండెడివి. నీతినిజాయతీలతో నింపినవి. ఆ కీర్తనలు పాడుచుండ పరవశమయ్యెడివాడు. దానిని చూచి అనేకమంది హాస్యము చేయుచూ ద్వేషించుచుండెడివారు. అట్టివారలను సహితము తాను ద్వేషించక గౌరవించుచుండెడివాడు. అతని భక్తి ప్రపత్తులు గురించి ఒకనాడు శివాజి కొంత ధనమిచ్చి మంత్రితో తుకారాం గృహమున యిచ్చిరమ్మని పంపగా, దానిని ముట్టక కన్నులు మూసుకొని, 'విఠలా! ఈ ధనము వైభవము నా హస్తములయందుంచి నీవు తప్పించుకొనిపోవ సంకల్పించితివా? ఈ కరములు తమ చరణములను తప్ప మరే ధనమును ముట్టవని తెలియదా!' అని ప్రార్థించెను. ఒక చీటీలో 'శివాజీ! నేను పాండురంగని శరణు జొచ్చిన వాడను. అతని వాంఛ తప్ప అన్య వాంఛలు నాకు లేవు. విఠలనాధుడే నా నాధుడైయుండ నేను అనాధను కాను. విఠలనాధునికంటె మించిన శ్రీమంతుడు లోకముననెందునూ లేడు. అతని ధనమంతా నాదే. కాన మీ ధనము మీకు వాపసు పంపినందుకు వేరుగా భావించకుడ'ని వ్రాసెను. నాటినుండి శివాజి తుకారాం సత్‌సంఘమున చేరి దాని లాభమును అనుభవించెను. ఇట్లు దైవసంబంధము తప్ప అన్యసంబంధమును ఆశించెడివాడు కాడు ఈ తుకారాం.

**చెరకు పంపకం**

తుకారాం పరమ భక్తుడు. అతనికి అర్ధ ఎకరము భూమి ఉండేది. దానిలో యేదో పండించుకోటమో, ఎండించుకోటమో జరుపుకొని పొట్టను నింపుకోటమో లేక కాల్చుకోటమో జరుగుతూ ఉండేది. కాని, తనయొక్క ఆహారవిహారములకు యేమాత్రము లెక్కచేయక దైవచింతన మాత్రం నిరంతరం సల్పుతుండేవాడు. ఒకమారు చెఱకు తోట వేసుకున్నాడు. అతని హృదయము త్యాగమయమైనది. భోగముతో కూడినది కాదు. అది పంటకు వచ్చేటప్పటికి దారినపోయేవారు, 'తాతా! తాతా! ఒక చెఱకు యిస్తావా?' అని అడిగేవారు. అడిగినవారినందరిని కొట్టుకొని తీసుకుపొమ్మనేవాడు. ఈవిధముగా జరుగుతూ వచ్చేటప్పటికి మూడుభాగముల చెఱకంతా యితరులకు దానంచేయటంతో సరిపోయింది. అంతోయింతో పనికిరాని చెఱకును మిగిల్చిపోయారన్నమాట. దానిని కట్టుకొని బండిలో వేసుకొని యింటికి వస్తున్నాడు. దారిలో పిల్లలందరూ చేరి నాకొక చెఱకు యివ్వమని అడుగుతూ వచ్చారు. దారిపొడవునా యిచ్చుకుంటూ వచ్చాడు. ఇంటి దగ్గరకొచ్చేటప్పటికి ఒక చిన్న చెఱకుతుంట మిగిలింది. బండి చూచింది. భార్య మండిపడింది. 'నీకేమి యింటిలో భార్యాబిడ్డలు లేరా? వీళ్ల గతి యేమనుకున్నావు? నీ దానాలతో ధర్మాలతో మునిగిపోతుంటే, కట్టుకున్నందుకు నీ కర్తవ్యాన్ని నిర్వర్తించక్కరలేదా?' అని ఈవిధంగా ప్రశ్నలవర్షం కురిపించింది. అన్నింటికి చిరునవ్వులతో చిందులు తొక్కాడు తుకారాం. కట్టకడపటికి, 'ఇదుగో తెచ్చాను ఒక చెఱకు నీకోసం' అన్నాడు. అది చేతికి యిచ్చేటప్పటికి ఆమెకు చాలా బాధ కలిగింది. కోపముకూడా వచ్చింది. ఆ చెఱకుతుండు తీసుకొని కాళ్లపైన కొట్టింది. ఒక తుండైపోయి క్రింద పడింది. ఒక తుండు ఆమె చేతిలో నిల్చింది. ఆనందంగా నవ్వాడు తుకారాం. ఈ తుకారాం నవ్వటానికి కారణమేమిటో తానే చెబుతున్నాడు. 'బండిలో ఈ చెఱకు తెచ్చినంతసేపూ పిల్లలకు ఏ భాగము, భార్యకు ఏ భాగము యివ్వాలని ఆలోచించుకుంటూ వచ్చాను.

ఇప్పుడు నాకా బాధ తీరిపోయింది. నీ భాగము నీ చేతిలో ఉంది. క్రింద పడిన భాగము పిల్లలకు సరిపోయింది' అన్నాడు. ఎంతసమంగా పంచావని అభినందించాడు.

తుకారాంను కలుసుకోటానికి ఒక తీర్థయాత్రికుల బృందం వెళ్ళింది. వారందరూ ఆ గ్రామానికి చెందినవారే. వారు ఎంతో గౌరవముతో, 'మీరుకూడా మాతో రావాలి' అని ప్రార్థించారు. తుకారాం తనకు రావటానికి వీలుకాదని చెప్పి, ఒక మూటను తెచ్చి వారికిచ్చి, 'ఈ మూటలో కొన్ని దోసకాయలున్నాయి. వీటిని మీతోబాటు యాత్ర చేయించి తీర్థములలో ముంచి తీసుకొని రండి' అన్నాడు. యాత్రికులు తుకారాం చెప్పినట్లే ఆ మూటను ప్రతి నదిలో ముంచి భగవద్దర్శనము చేయించారు. కొంత కాలమునకు తమ స్వగ్రామానికి చేరారు. తుకారామును కలసి భక్తిప్రపత్తులతో ఆ మూటను యిచ్చేసారు. తుకారాం వారందరినీ మరుసటి దినము తన యింటికి భోజనానికి రమ్మని ఆహ్వానించాడు.

తుకారాం ఆ దోసకాయలతో పులుసు చేయించి అన్నింటితోబాటు వడ్డించాడు. భోజనమైన తరువాత అందరూ ఒకచోట కూర్చున్నారు. వారితో తుకారాం, 'మీకు దోసకాయలలో యేమైనా మార్పు కనబడిందా. ఇదివరకులాగే చేదుగానే వున్నాయా?' అని ప్రశ్నించాడు. 'స్వామీ! దోసకాయలు చేదుగానే వున్నాయండి' అన్నారు. తుకారాం, 'చూసారా! ఎన్ని తీర్థములలో ముంచిననూ, ఎన్ని దోవాలయములలోకి వెళ్ళినా దోసకాయలు చేదుగానే వున్నాయి. అవి సహజ గుణమైన చేదును మార్చుకోలేదు. అదేవిధంగా మీలోకూడా తీర్థయాత్రలు చేసిన తరువాత కూడా ఎట్టి మార్పూ లేకపోతే, అది వ్యర్థ ప్రయాసమవుతుంది. తీర్థయాత్రలు మానవుని ప్రవర్తనలో పరివర్తన తెచ్చుటకు ఏర్పడినవి. తీర్థయాత్రలంటే వినోదయాత్రలు కాదు' అని ప్రబోధించాడు.